క్లుప్తంగా

సత్యవేడు తహసీల్దారుగా శ్రీదేవి



సత్యవేడు: తహసీల్దారుగా శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయంలో డివిజినల్ ఏఓ పనిచేస్తూ బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న టివి. సుబ్రమణ్యం బుచ్చినాయుడు కండ్రిగకు బదిలీపై వెళ్లారు. శ్రీదేవి మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు మండల సమావేశం

వరదయ్యపాళెం: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 2గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

శేషాచల అడవుల్లో మంటలు



దగ్ధమవుతున్న శేషాచల అడవులు

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి సమీపంలోని శేషాచల అడవుల్లో బుధవారం మంటలు ఎగసి పడ్డాయి. ఆగంతకులు నిప్పు పెట్టడంతో అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అడవులకు నిప్పు పెడితే కలిగే నష్టాలు, అడవుల సంరక్షణ గురించి సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

పురాతన శివాలయం పరిశీలన



శివాలయాన్ని పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఈటీసీ కార్యాలయ సమీపంలోని శివాలయాన్ని బుధవారం శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, శిథిలావస్థకు చేరిన ఆలయానికి జీర్ణోద్ధరణ పనులు చేయనున్నట్లు చెప్పారు. దీనిపై పాలకమండలి సమావేశంలో చర్చిస్తామని, అలాగే ఆలయానికి మంచినీటి వసతి కోసం బోరు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయాభివృద్ధి పనులకు పూనుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈటీసీ ప్రిన్సిపల్ పద్మజ, పాలకమండలి సభ్యులు పసల సుమతి, ఆలయ ఇంజినీరింగ్ శాఖ అధికారులు మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శోభారాణి, అధికారులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ యూత్ చేరిక



పార్టీలో చేరిన టీడీపీ యూత్ నాయకులతో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులో శనివారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి సమక్షంలో టీడీపీ మండల యూత్ నాయకులు చెంగయ్య, గంగయ్య, భాస్కరయ్య, శేఖర్, వినోద్, ధర్మేంద్ర, గురుప్రసాద్, వేంకటేశ్వర్లు, సాంబశివయ్య, శీనయ్య, ప్రతాప్, మనోహర్, సంతోష్, మునీంద్ర, మణి, వెంకటయ్య, శంకరయ్య, చిరంజీవితోపాటు భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి అరణి విద్యానాథరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు టీడీపీ యూత్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సురుటుపల్లి దేవస్థానం ట్రస్ట్ సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఇమామ్‌బాషా, వేణు, వంక సుబ్రమణ్యం, తులసీరామ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి శ్రీకాళహస్తి వాసి మృతి

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు స్వర్ణముఖి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్ వైర్లు తగిలి కుమార్(40) అనే వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాళహస్తి పట్టణం పానగల్ ప్రాంతానికి చెందిన ఐదుగురు చిల్లకూరు వద్ద స్వర్ణముఖినదిలో చేపలు పట్టేందుకు మంగళవారం రాత్రి వెళ్లారు. అర్ధరాత్రి చేపలు వేట ముగించుకుని తిరిగి నది నుంచి గట్టుపైకి వెళ్లే క్రమంలో కుమార్ అనే వ్యక్తి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ప్రతి గడపకూ సంక్షేమం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యం
- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- సచివాలయ, ఆర్బీకే భవనాల ప్రారంభం



మహిళలతో మాట్లాడుతున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: పార్టీకలతీతంగా ప్రతి ఇంటి గడపకూ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం మండలంలోని ఎరికంబట్టు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. తొలుత ఎరికంబట్టు సచివాలయ, ఆర్బీకే భవనాలను ప్రారంభించారు. అనంతరం జంగాలపల్లె, ఎరికంబట్టు దళితవాడ, ఎరికంబట్టులో పర్యటించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి మాట్లాడారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

పై మూడు గ్రామాల్లో శ్మశాన వాటికల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే ఎరికంబట్టు దళితవాడలో మురుగు కాలువ, ఎరికంబట్టు గ్రామానికి నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. శ్మశాన వాటికల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఎరికంబట్టు దారి పనులను కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎరిమంబట్టు దళితవాడలో మహిళలతో ఎమ్మెల్యే మాట్లాడారు. నవరత్నాలతో పాటు పలు సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తూ మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు హేమమ్మ, శివశంకర్, సర్పంచ్ సుబ్బలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, డీఈలు మధుసూదన్, దామోదరనాయుడు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ శ్రేణులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ఎరికంబట్టు సచివాలయ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

విమర్శించే అర్హత పచ్చ పార్టీకి లేదు

సీఎం జగనన్నను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత పచ్చ పార్టీ నాయకులకు లేదని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వర్గాలకు, వర్గాలకతీతంగా అమలవుతున్న సంక్షేమ పథకాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు లక్షలాది రూపాయలు లబ్ధి పొందినవారూ ఉన్నారని, అయినా పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులకు బుద్ధి చెప్పాలని మహిళలకు పిలుపునిచ్చారు. జంగాలపల్లెలో టీడీపీ నాయకుడు ఎరుకని మునిచంద్రయ్య తమ ప్రభుత్వం నుంచి అక్షరాలా రూ.3.90 లక్షల లబ్ధి పొందాడని, అయినా కువిమర్శలు చేయడం చూస్తే వారి నీచబుద్ధి ఏమిటో ఇట్టే తెలుస్తోందని మండిపడ్డారు. తమ తీరు మార్చుకోకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు.

నేడు ఇందిరానగర్‌లో గడప గడపకు..

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో గురువారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించనున్నట్టు జరగనున్నట్లు ఎంపీపీ పద్మప్రియ తెలిపారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం చేస్తే సహించం



మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ చిన్నా, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్

వరదయ్యపాళెం: ఉద్దేశపూర్వకంగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, దీనికి స్వస్తి పలకకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నా, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్ హెచ్చరించారు. బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. కొన్ని రోజులుగా నియోజకవర్గానికి చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లో ఎల్లో మీడియా ముసుగులో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, మైనారిటీ సెల్ కన్వీనర్ అబ్దుల్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్‌రెడ్డి, మహేంద్ర, శోభన్ యాదవ్, మాధవయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

'సిపాయి భరోసా' పంపిణీ



సిపాయి భరోసా సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: మండలంలోని విప్పమానుపట్టెడ సంజీవరెడ్డి కాలనీలో దినేష్ కుటుంబానికి దశదిన కర్మను పురస్కరించుకుని సిపాయి ఫౌండేషన్ ద్వారా బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తన పేరిట 'సిపాయి భరోసా' సరుకులను పంపిణీ చేశారు. 42రకాల నిత్యావసర వస్తువుల కిట్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు. రానున్న రోజుల్లో తమ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన చెప్పారు. అలాగే తిరుపతిలోని రష్ ఆస్పత్రిలో తాము 90రకాల జబ్బులకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచిత ఆపరేషన్లు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఖైదీలకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీకాంత్

శ్రీకాళహస్తి: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం, శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి ఆదేశాలతో బుధవారం శ్రీకాళహస్తి సబ్‌జైల్‌లో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు ఖైదీలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ, ఖైదీల సంరక్షణ, న్యాయపరమైన సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల రూపంలో ఇస్తే పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ మాట్లాడారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, ప్రజ్ఞశ్రీ, సబ్‌జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా అర్హులకు పథకాలు



కుమ్మరికండ్రిగలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

- ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతుల్లో మార్పు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: నిష్పక్షపాతంగా రాష్ట్రంలో అర్హులందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తోందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మండలంలోని పాగాలి పంచాయతీ కేంద్రంతోపాటు ఎస్సీ, కుమ్మరిగుంట గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని 280 కుటుంబాలను కలిశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

పాగాలి, ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని, మురుగునీటి కాలువల నిర్మించాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతుల్లో మార్పు తెచ్చారని, ఫలితంగా పేద, మధ్య తరగతి కుటుంబాలన్నీ మా నమ్మకం నువ్వే జగన్ అనే భరోసాతో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, సర్పంచ్ రాజేశ్వరి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిఖార్జునరెడ్డి, యుగంధర్, కుమార్‌రెడ్డి, కిరణ్ నాయుడు, గురునాధం, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికీలలపై సమరం



కైలాసగిరుల్లో ఎగసి పడుతున్న మంటలు

- ఆందోళన చెందిన పట్టణ ప్రజలు
- మంటల ధాటికి బుగ్గి అయిన వృక్ష సంపద
- గంటల తరబడి శ్రమించి మంటలు ఆర్పిన వైనం
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే, పాలక మండలి చైర్మన్



కొండమిట్ట ప్రాంతాన్ని పరిశీలించి కన్నప్పకొండ నుంచి కిందకు వస్తున్న ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి: కైలాసగిరుల్లో బుధవారం సాయంత్రం రేగిన మంటలు శ్రీకాళహస్తి పట్టణ వాసులను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి. ఎండిన బోద ఉండడంతో క్షణాల్లో మంటలు విస్తరిస్తూ వృక్ష సంపద బుగ్గి అవుతూండడటం, గోశాలకు సమీపంలోకి మంటలు రావడంతో ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని అటవీ, ఫైర్, ఆలయ ఉద్యోగులు, ఇంజినీరింగ్, హోమ్‌గార్డులు, సెక్యూరిటీ గార్డులు, స్వచ్ఛందంగా వచ్చిన యువకులను సమన్వయం చేసి మంటలను ఆర్పేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. గోశాలకు వద్ద నిల్వ ఉంచిన వంద టన్నుల పైచిలుకు పశు గ్రాసం ఎక్కడ మంటలు అంటుకుని బుగ్గి అవుతుందోనని టెన్షన్ పడ్డారు. పశుగ్రాసంపై నీటిని చల్లి మంటల బారిన పడకుండా ఉండేందుకు యత్నించారు. ఎట్టకేలకు గోశాలకు 10 అడుగుల సమీపంలోకి మంటలు వచ్చేవేళకు వాటిని ఆర్పివేశారు. 10 నుంచి 15 అడుగులపైకి ఎగసిపడుతున్న మంటలను ఆర్పడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫైరింజన్లకు తోడు రోడ్డు పనులకు వినియోగిస్తున్న నీళ్ల ట్యాంకర్ల సాయం కూడా తీసుకున్నారు. దాదాపు 300మంది అగ్నికీలలను ఆర్పడంలో నిర్విరామంగా శ్రమించారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మొదలైన మంటలను ఆర్పేసరికి రాత్రి 10.30 గంటలు దాటింది. అప్పటికే కిలోమీటరు విస్తీర్ణంలో కొండ బుగ్గి అయ్యింది. ఈ అగ్ని ప్రమాదం ఎన్నో పాఠాలను నేర్పింది. కొండమిట్ట ప్రాంతం వైపు మంటలు విస్తరించకుండా కృషి చేయడంతో ఆ ప్రాంత స్థిరనివాసులు ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్తులో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు చేస్తున్నారు. మంటలను ఆర్పడంలో శ్రమించిన వారందరినీ ఎమ్మెల్యే అభినందించారు.

ఆధ్యాత్మికంగా అర్ధనారీశ్వరాలయం

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన అనుబంధ ఆలయమైన అర్ధనారీశ్వర ఆలయాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు సూచించారు. బుధవారం అర్ధనారీశ్వరాలయం అభివృద్ధి పనులపై చైర్మన్, ఆలయాధికారుల, ఇంజినీరింగ్, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆలయ పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. గతంలో కంటే భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవారి అభిషేకాలను చూసే విధంగా ఏర్పాట్లు చేయాలని, పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా మెరుగైన ఏర్పాట్లు చేసి, మండపాలు నిర్మించాలన్నారు. అలాగే దేవస్థానం ప్రాంగణంలో సప్త గోశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుని త్వరలోనే ప్రారంభించాలని ఆదేశించారు. దేవస్థానం అభివృద్ధి పనులకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే దేవస్థానం ప్రాంగణంలో నక్షత్రవనంలో దేవతామూర్తుల వృక్షాలను ఏర్పాటు చేయడానికి, అలాగే 9 నవగ్రహాలు, 27 నక్షత్రాలకు సంబంధించిన వృక్షాలకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఇంజినీరింగ్ శాఖ ఈఈ మురళీధర్ రెడ్డి, డీఈ శ్రీనివాసులు రెడ్డి, ఏఈ శోభారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థపతి కుమార్, ఇరిగేషన్ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు పసల సుమతి, పట్టణ ప్రముఖులు పసల రమణయ్య, పసల కుమారస్వామి, పులి రామచంద్రయ్య, నరసింహులు, రమేష్, రవి నాయుడు పాల్గొన్నారు.

వాస్తవాలను వక్రీకరించడం తగదు



మాట్లాడుతున్న సుశీల్ కుమార్ రెడ్డి

సత్యవేడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సత్యవేడులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విజయవంతంగా నిర్వహించారని, అయితే ఉద్దేశపూర్వకంగా మహా టీవీ చానల్ తప్పుడు ప్రసారం చేయడం సరికాదని పార్టీ మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి ఖండించారు. బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలోవారు మాట్లాడారు. వికలాంగుడైన సుబ్రమణ్యం అనే వ్యక్తికి ఎమ్మెల్యే బుక్‌లెట్‌ను ఇచ్చారని, చేతులు వణుకుతుండటం మూలాన అతను ఎక్కువసేపు దానిని పట్టుకోలేక కిందకు వదిలేశాడని, అయితే సుబ్రమణ్యం బుక్‌లెట్‌ను పడేశాడంటూ మహాటీవీ వక్రీకరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా వ్యక్తిగత కారణాలతో ఒకరిద్దరు నేతలు కార్యక్రమానికి గైర్హాజరైతే వర్గ విబేధాలంటూ బురద చల్లిందని, వాస్తవాలు ప్రసారం చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి, పునిద కుమార్, ఎంపీ రవి, చిన్నబ్బ, కుమార్, నరేష్, రమేష్, సెంథిల్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజలకు అపార విశ్వాసం

- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా వాటిని పారదర్శకంగా గడప గడపకు చేరవేస్తుండడంతో ప్రభుత్వంపై ప్రజలు అపార విశ్వాసం చూపుతున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని చింతలపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ స్టిక్కర్లు అంటించి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో రూ.లక్షల కోట్లు నేతల జేబుల్లోకి వెళితే, జగనన్న పాలనలో పేదల ఇళ్లకు చేరాయన్నారు. ఐదు ప్రశ్నలతో కూడిన బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ బాలప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీటీసీ కూనాటి రమణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటాద్రి, దేశయ్య, దాము, సురేష్, రామారావు, వెంకీ మురగయ్య, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని 34 వ వార్డు బీపీ అగ్రహారంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ సంఘం అధ్యక్షులు, వార్డు ఇన్‌చార్జి ఆర్కాడ్ శంకర్ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించారు. ప్రతి ఇంటికి, ఇళ్లల్లోని వ్యక్తుల సెల్‌ఫోన్లకు జగనన్న స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నాగేంద్ర రెడ్డి, కవితా రెడ్డి, గృహ సారథులు మోహన్, బాబు, మునిరామయ్య, మహేష్, వలంటీర్లు జ్ఞాన ప్రసాద్, చంద్ర పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని మాధవమాలలో సర్పంచ్ బల్కిస్ బేగం, మండల వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, చెల్లూరులో రాజా ఆధ్వర్యంలో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

కంచరపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని కంచరపాళెంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ బందిల సురేష్, మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, ఇతర పార్టీ శ్రేణులు హాజరై ఇంటింటా లబ్ధిదారుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, మాజీ మండల కన్వీనర్ పాల సుబ్రమణ్యం రెడ్డి, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్, స్థానిక సచివాలయ కన్వీనర్ తులసి, నియోజకవర్గ సోషల్ మీడియా కో–కన్వీనర్ శోభన్ యాదవ్, శేఖర్ శెట్టి, నాగరాజు, మహేంద్ర, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : బీపీ అగ్రహారంలో..



వరదయ్యపాళెం : కంచరపాళెంలో..

21 కేజీల గంజాయి స్వాధీనం

- 12 మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ

గూడూరు: పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న 12 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 21 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం గూడూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జానకీరామ్‌తో కలసి ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ రాజేందర్ వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలోనే బుధవారం డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఒకటో పట్టణ సీఐ హజరత్‌బాబు సిబ్బందితోపాటు, ఎస్ఈబీ అధికారులు పట్టణంలో దాడులు చేశారని తెలిపారు. ఈ దాడుల్లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న 12 మందిని అరెస్టు చేసి, 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గత రెండు రోజుల క్రితమే నెల్లూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు 26 కిలోల గంజాయిని విక్రయిస్తుండగా, ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు.